సాక్షి అన్నమయ్య జిల్లా

మంగళవారం । 10 । సెప్టెంబర్ । 2024



సంబరంలో విషాదం

సంబరం విషాదంగా మారింది. గణేష్ నిమజ్జనంలో ఆనందంతో పాలుపంచుకున్న కొంత మంది తిరిగి ఇంటికి రాలేదు. తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయారు. - 8లో



బూచోళ్ల భయం.. అవగాహనతోనే దూరం

చిన్నారులపై జరిగే అఘాయిత్యాలకు అడ్డుకట్ట వేయాలంటే మంచి, చెడులపై పిల్లలకు అవగాహన కల్పించాలి. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.230	రూ.280
రెండోరకం	రూ.140	రూ.220

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 186 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కలకడ : కలకడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపక పోస్టులకు అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ జయభారతి తెలిపారు. స్థానిక కళాశాలలో జువాలజీ అధ్యాపకుల పోస్టు ఖాళీగా ఉందన్నారు. పీజీ జువాలజీ సబ్జెక్టులో 50శాతం మార్కులు కలిగి ఆసక్తి కలిగిన వారు 11వతేదీ బుధవారం ఉదయం 11 గంటలకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో కలకడ కళాశాలలో హాజరు కావాలని కోరారు.

10 వేల క్వింటాళ్ల ఉలవలు మంజూరు

రాయచోటి : అన్నమయ్య జిల్లాకు పదివేల క్వింటాళ్ల ఉలవలు మంజూరైనట్లు జిల్లా వ్యవసాయ అధికారి చంద్ర నాయక్ తెలిపారు. ఖరీఫ్ సీజన్‌లో అనుకూల వర్షాలు లేకపోవడంతో పంట సాగు గణనీయంగా పడిపోయింది. సాధారణ సాగులో 15శాతం మించి పంటలు సాగుకు నోచుకోలేదు. ఖరీఫ్ సీజన్ ముగుస్తున్నా వర్షాలు రాకపోవడంతో ప్రత్యామ్నాయంగా పంటల సాగుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. ఈ క్రమంలో జిల్లాకు ఉలవలు మంజూరు చేసింది. త్వరలోనే మండలాల వారీగా 80 శాతం సబ్సిడీతో రైతులకు అందజేస్తామని జిల్లా వ్యవసాయ అధికారి తెలిపారు.

భద్రకాళీ సమేతుడికి పల్లకీ సేవ



శ్రీ భద్రకాళీ సమేతుడిని పల్లకీ సేవకు సిద్ధం చేస్తున్న ఆలయ ప్రధాన అర్చకులు

రాయచోటి టౌన్ : రాయచోటి శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామికి పల్లకీ సేవ అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సోమవారం రాత్రి ఆలయంలోని మూల విరాట్‌లకు అభిషేకాలు, పూజలు నిర్వహించి అందంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను ఆలయం ప్రాంగణంలో, ఆలయ మాఢ వీధులలో ఊరేగించారు. ఈ ఊరేగింపులో స్థానిక భక్తులతో పాటు కన్నడ భక్తులు విశేషంగా పాల్గొన్నారు. ఈ పల్లకీ సేవ ఆలయ ఈఓ డీవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు.

రసాభాసగా ఇసుక బుకింగ్




కూచివారిపల్లె సచివాలయం వద్ద ఇసుక టోకెన్ల కోసం తోపులాట

రాజంపేట : రాజంపేట–రాయచోటి రహదారిలోని కూచివారిపల్లె సచివాలయంలో ఇసుక బుకింగ్ రసాభాసగా మారింది. సోమవారం ఆర్‌బుడుగుంటపల్లెలో ఇసుక కోసం ఇసుక మాఫియాకు చెందిన వారు, భవన నిర్మాణాలు చేపడుతున్న వారు ఇసుక టోకెన్ కోసం సచివాలయం వద్దకు తరలివచ్చారు. బుకింగ్ కౌంటర్ వద్ద కొత్త సినిమా తరహాలో తోపులాట చోటుచేసుకుంది. పోలీసులు రంగప్రవేశం చేశారు. ఉదయం 7గంటల నుంచి క్యూలైన్‌లో పడిగాపులు కాశారు. రోజువారి బుకింగ్ అయిపోవడంతో, రేపటి బుకింగ్ టోకెన్ల కోసం ఉదయం నుంచి క్యూలైన్‌లో ఇసుకాసురులు నిలబడ్డారు. ఈ సందర్భంగా టోకన్ కోసం తోపులాటకు దిగారు.

12 నుంచి నవోదయలో జాతీయ స్థాయి యోగా మీట్

మదనపల్లె సిటీ : మదనపల్లె పట్టణం చిత్తూరురోడ్డులోని జవహర్ నవోదయ విద్యాలయంలో ఈనెల 12వ తేదీ నుంచి 14వతేదీ వరకు 14వ ఎన్‌వీఎస్ జాతీయ స్థాయి యోగా మీట్–2024–25 నిర్వహిస్తున్నట్లు విద్యాలయ ప్రిన్సిపాల్ గోవిందరావు తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ పోటీలకు మధ్యప్రదేశ్, ఒరిస్సా, ఛత్తీసగఢ్ రాష్ట్రాలకు భోపాల్ రీజియన్ ప్రాతినిధ్యం వహిస్తుందన్నారు. జమ్మూ, కాశ్మీర్, పంజాబ్, ఛండీగడ్ , హిమాచల్‌ప్రదేశ్, లడఖ్ రాష్ట్రాలకు చండీగడ్ రీజియన్ ప్రాతినిధ్యం వహిస్తుందన్నారు. అలాగే ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, తెలంగాణ, అండమాన్, నికోబార్, పాండిచ్చేరి, లక్ష్యద్వీప్‌లకు హైదరాబాదు రీజియన్, హర్యానా, రాజస్థాన్, ఢిల్లీలకు జైపూర్ రీజియన్, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్‌లకు లక్నో రీజియన్, బీహార్, పశ్చిమబెంగాల్, జార్ఖండ్‌లకు పాట్నా రీజియన్, దయ్యు, డామన్, దాద్రానగర్ హవేలి, మహారాష్ట్ర, గుజరాత్, గోవాలకు పూణే రీజియన్, మేఘాలయ, అస్సాం, మణిపూర్, సిక్కిం, అరుణాచల ప్రదేశ్, నాగాలాండ్, మిజోరం, త్రిపురలకు షిల్లాంగ్ రీజియన్ ప్రాతినిధ్యం వహిస్తాయని వివరించారు. ఈ మీట్‌లో మొత్తం 360 మంది విద్యార్థులు పాల్గొంటారన్నారు. ఈ మీట్‌ను పర్యవేక్షించేందుకు నవోదయ డిప్యూటీ కమిషనర్ చక్రవర్తి, బెంగళూరు నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ నాగరాజు హాజరవుతారన్నారు.

ఎన్నికల హామీ.. ఏమైంది బాబూ!



- వలంటీర్ల వ్యవస్థకు రూపకల్పన చేసిన నాటి సీఎం వైఎస్ జగన్
- వైఎస్సార్‌సీపీ హయాంలో విశేష సేవలు అందించిన వలంటీర్లు
- ఎన్నికలకు ముందు రూ. 10 వేలు ఇస్తానని మాట ఇచ్చిన బాబు
- కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎటూ తేల్చని వైనం
- విజయవాడలో వరద దుర్ఘటన నేపథ్యంలో వలంటీర్ల సేవలను గుర్తు చేసుకుంటున్న ప్రజలు

సాక్షి రాయచోటి : ఎన్నికలకు ముందు ఒక మాట..తర్వాత మరోమాట చెప్పడం టీడీపీ అధినేత, ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబుకు పరిపాటిగా మారింది. గతంలోనూ 2014లో ఇలాంటి మాటలతోనే ప్రజలను బురిడీ కొట్టించి అధికారంలోకి రాగా మరొక మారు అనేక వర్గాల వారికి మాయా బాబు మహా శఠగోపం పెడుతున్నారు. ఈసారి కూడా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామంటూనే ఇప్పటికీ అమలు చేయని తీరును ప్రజలు చర్చించుకుంటున్నారు. మరోవైపు వైఎస్ జగన్ సర్కార్ 2019 నుంచి వలంటీర్ల వ్యవస్థను అందుబాటులోకి తేగా...అందులో వలంటీర్లకు సంబంధించి రూ. 5 వేలు కాదు..రూ. 10 వేలు గౌరవ వేతనం పెంచి ఇస్తామని చెప్పి ఏకంగా వ్యవస్థకే మంగళం పాడేలా కనిపిస్తున్నారు. రూ. 10 వేలు పెంపు లేకపోగా చివరికి వారిని పట్టించుకునే పరిస్థితి లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఇంటికి సంక్షేమం అందించడంలో కీలకపాత్ర పోషించిన వలంటీర్ల కొనసాగింపే ప్రస్తుతం ప్రశ్నార్థకంగా మారింది.

అధికారంలోకి వచ్చినా ఎదురు చూపులే

గత సార్వత్రిక ఎన్నికల అనంతరం కూటమి సర్కార్ రాష్ట్రంలో అధికార పగ్గాలు చేపట్టింది. చంద్రబాబు ప్రభుత్వంలో వలంటీర్లు కూడా రూ. 10 వేలు గౌరవంగా తీసుకుంటామని ఆశపడ్డ వారికి భంగపాటు తప్పలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడి మూడు నెలలు దాటుతున్నా ఇప్పటివరకు అతీగతీ లేదు. అందులోనూ రెండు దఫాలుగా పింఛన్ల పంపిణీలోనూ వలంటీర్లను పక్కన పెట్టి సచివాలయాల సిబ్బంది ద్వారా పంపిణీకి శ్రీకారం చుట్టారు. దీనిని బట్టి వలంటీర్లను కొనసాగించడం దాదాపు అనుమానమే. మూడు నెలలుగా వలంటీర్లను మళ్లీ తీసుకుంటారేమోనన్న ఆశతో ఎదురు చూస్తూనే ఉన్నారు.

జిల్లాలో మొత్తం సచివాలయాలు	501
జిల్లాలో మొత్తం మండలాలు	30
మొత్తం వలంటీర్లు	8658



ప్రతి ఇంటికి సంక్షేమాన్ని పంచిన వలంటీర్లు

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 2019లో అధికారంలోకి రాగానే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ల వ్యవస్థకు శ్రీకారం చుట్టారు. అప్పటి నుంచి 2024 ఎన్నికల వరకు ప్రజలకు విశేష సేవలు అందించారు. ప్రతి ఇంటికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడం మొదలుకొని ఎప్పటికప్పుడు ప్రజలకు నీటిని అందించే విషయం, ఆధార్ అప్‌డేట్లు, సర్టిఫికెట్లు, ఆరోగ్య శిబిరాలు, చిన్నపిల్లలకు వేసే వ్యాక్సిన్లు ఇలా ప్రతి ఒక్కటీ వారి ద్వారానే జరుగుతూ వచ్చింది. ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా ఎప్పటికప్పుడు సమాచారాన్ని సైతం ప్రజలకు చేరవేస్తూ వచ్చారు. వలంటీర్ల ద్వారా ఇళ్ల వద్దకే పథకాలతోపాటు పాలన కొనసాగేది. వైఎస్ జగన్ హయాంలో ప్రజలతో అనునిత్యం మమేకం అవుతూ ఒక వెలుగు వెలిగిన వలంటీర్లకు ప్రస్తుతం కష్టకాలం వెంటాడుతోంది.

వలంటీర్ వ్యవస్థను కొనసాగించాలి

ఎన్నికల ముందు ఓట్లు, సీట్ల కోసం చంద్రబాబు వలంటీర్లకు గౌరవ వేతనం పెంపు పేరుతో వల వేశారు. వలంటీర్ల గౌరవ వేతనం సంగతి దేవుడెరుగు...అధికారంలోకి రాగానే వారి గురించే మరిచిపోయారు. అయితే విజయవాడలో వరదలు పోటెత్తడంతోపాటు బుడమేరుకు గండ్లు పడి జలప్రళయం విజయవాడను ముంచెత్తింది. దీంతో వలంటీర్ల వ్యవస్థ కొనసాగి ఉంటే ఎప్పటికప్పుడు అప్రమత్తం కావడంతోపాటు అన్ని విషయాలు తెలిసేవని, పరిస్థితి మరోలా ఉండేదని వలంటీర్ల గురించి చర్చ మొదలైంది. ఈ నేపథ్యంలో ప్రతి 50 ఇళ్లకు ఒక వలంటీర్ ఉండడం ద్వారా ఉపద్రవాలు, ఉప్పెనలు, ఇతర అతలాకుతలం పరిస్థితులు, ఇంకా ఎలాంటి సమాచారం ఉన్నా ముందే ప్రజలకు తెలియజేసే అవకాశం ఉంటుందని.. వలంటీర్లను కొనసాగించాలని ప్రజల నుంచి కూడా డిమాండ్ వినవస్తోంది. ప్రజల అవసరాల నిమిత్తం వలంటీర్లను కొనసాగిస్తారో...లేక పక్షపాత ధోరణితో కూటమి సర్కార్ అణచి వేస్తుందో వేచి చూడాల్సిందే. ఏది ఏమైనా వలంటీర్లు చేసిన సేవలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు గౌరవ వేతనాన్ని పెంచి అందరినీ కొనసాగించాలని వలంటీర్ల సంఘం డిమాండ్ చేస్తోంది.

తగిన నిర్ణయం తీసుకోవాలి



గ్రామ,వార్డు వలంటీర్లను తిరిగి వెంటనే విధుల్లోకి తీసుకుని న్యాయం చేయాలి. వలంటీర్లుగా ప్రజలకు అందుబాటులో ఉంటూ అనేక రకాలుగా చేసిన సేవలను ప్రభుత్వం గుర్తించాలి. గత ఆరు నెలలుగా జీతభత్యాలు లేక, విధులు లేక సందిగ్ధావస్థలో ఉన్న వలంటీర్లపై ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకోవాలి.

– రెడ్డి శివకృష్ణ, కొండయ్యగారి పల్లె, నిమ్మనపల్లె మండలం

సీఎం హామీని నిలబెట్టుకోవాలి



వలంటీర్ల వ్యవస్థను కొనసాగించి సీఎం చంద్రబాబునాయుడు తన ఎన్నికల వాగ్దానాన్ని నిలబెట్టుకోవాలి. ఇచ్చిన మాట ప్రకారం వలంటీర్లకు గౌరవ వేతనం రూ.10వేలు అందించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. గ్రామ, వార్డు వలంటీర్ల అవస్థలు గుర్తించి వెంటనే వలంటీర్ల వ్యవస్థ కొనసాగింపుపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుని వలంటీర్లకు న్యాయం చేయాలి.

– వెంకటేష్, గ్రామ వలంటీర్, నిమ్మనపల్లె.

విధుల్లోకి తీసుకోండి



ప్రజలకు ఎన్నో సేవలందించిన వలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలి. ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకొని వలంటీర్లకు న్యాయం చేయాలి. గతంలో ప్రజలకు ఎన్నో సేవలందించాం. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వలంటీర్ల సేవలను వినియోగించుకోవాలి.

– శివరామ్, సంబేపల్లె వలంటీర్

ఎన్నో సేవలందించాం



గత ప్రభుత్వంలో ప్రజలకు ఎన్నో సేవలు అందించాము. కరోనా సమయంలో ప్రాణాలు ఫణంగా పెట్టి ప్రజలకు అందుబాటులో ఉండి మందులను అందజేశాము. సుదూర ప్రాంతాలలోని ఆసుపత్రిలో ఆరోగ్యం బాగాలేక చికిత్స పొందుతున్న వారికి పింఛన్, వివిధ పథకాలు అందజేశాము. మా సేవలను గుర్తించాలి.

– సుబ్బరాయుడు, వలంటీర్, శెట్టిపల్లె పాళెంగడ్డ, సంబేపల్లె

ఇసుక అక్రమాలపై కఠిన చర్యలు

జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్



రాయచోటి : జిల్లాలో ఇసుకను అక్రమంగా నిల్వచేసినా, తరలించినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. సోమవారం రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో గనులు, రవాణా శాఖ ఆధ్వర్యంలో ట్రాక్టర్లు, లారీ, టిప్పర్ యజమానులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ప్రజలకు ప్రభుత్వం ఇసుకను పూర్తిగా ఉచితంగా ఇస్తోందని తెలిపారు. కేవలం నిర్వహణ చార్జీలు, రవాణా చార్జీలు మాత్రమే వినియోగదారులు చెల్లించాల్సి ఉంటుందన్నారు. అయితే ఎక్కడైనా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వాహన చోదకులకు ఏమైనా సమస్యలు ఉన్నా, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్ చర్చించారు. ఇసుక బుకింగ్ నిమిత్తం త్వరలో ప్రభుత్వం ఆన్‌లైన్ విధానాన్ని తీసుకొస్తుందన్నారు. జిల్లా మైనింగ్ అధికారి రవి కుమార్, జిల్లా ట్రాన్స్‌పోర్ట్ అధికారి భరత్, పోలీస్ అధికారులు, ట్రాక్టర్, లారీ, టిప్పర్ యజమానులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపాలి

ప్రజా సమస్యల పరిష్కారంలో ఆయా శాఖల అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆదేశించారు. రాయచోటి కలెక్టరేట్‌లోని సమావేశ హాలులో సోమవారం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా అందిన ప్రజల సమస్యలను అత్యంత ప్రాధాన్యతతో బాధ్యతగా పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు.

గణనాథునికి ఘనంగా వీడ్కోలు



పీలేరులో కోలాహలంగా గణేష్ విగ్రహాల ఊరేగింపు



సిద్దవటం పెన్నానదిలో వినాయకుడిని నిమజ్జనం చేసిన దృశ్యం

రాయచోటి : బొజ్జ గణపతిని మూడు రోజులపాటు పూజించిన అనంతరం సోమవారం జిల్లా అంతటా భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు. ఈ సంవత్సరం 20 శాతం ఎక్కువ విగ్రహాలను పందిళ్లలో ఏర్పాటు చేశారు. మూడు రోజులు పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం పెద్ద ఎత్తున భక్తులు స్వామిని చూసేందుకు హాజరయ్యారు. నిర్వాహకులు వారందరికీ తీర్థ ప్రసాదాలను అందజేశారు. జిల్లా అంతటా దాదాపు 90 శాతం విగ్రహాలను సోమవారం నిమజ్జనం చేశారు. భారీ విగ్రహాలను 5, 7, 9 రోజుల్లో నిమజ్జనం చేసేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

అక్కడ బుడమేరు.. ఇక్కడ చక్రాలమడుగు!

- ముప్పు ముంగిట రాజంపేట
- భారీ వర్షాలు కురిస్తే ఆందోళన
- మడుగు వెంబడి రక్షణ గోడ ఏదీ?
- మేల్కోకుంటే.. మునక తప్పదు
- బాబు పాలనలో మళ్లీ ఆక్రమణల పర్వం

మడుగు	: చక్రాలమడుగు
పట్టణం	: రాజంపేట
విస్తీర్ణం	: 25 ఎకరాలు
ప్రస్తుతం	: 6 ఎకరాలు
వరద ప్రవాహం	: శేషాచలం టు హత్యరాల





కబ్జాలతో కుంచించుకుపోయిన రాజంపేట పట్టణంలోని చక్రాలమడుగు

రాజంపేట : విజయవాడను ముంచేసిన బుడమేరు తరహాలో పార్లమెంటరీ నియోజకవర్గ కేంద్రమైన రాజంపేట పట్టణం నడిబొడ్డున ఆనుకుని చక్రాలమడుగు వంక ప్రవహిస్తోంది. ఏకధాటిగా 10 సెం.మీ వర్షం కురిస్తే పట్టణంలోని పాతబస్టాండు, రాంనగర్ మడుగువైపు, బైపాస్, కమ్మకాంప్లెక్స్ ఏరియా మడుగు పరిసరాలు జలమయం కావడం తథ్యం. అక్కడ బుడమేరు, ఇక్కడ చక్రాల మడుగు అని ఇక్కడి ప్రాంతీయులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పుడు మేల్కోకుంటే...వరద వచ్చిన ప్రతిసారి మునక తప్పదంటున్నారు. మడుగు వెంబడి రక్షణ గోడలు కనుమరుగయ్యాయి. శాశ్వత పరిష్కారం మరిచిపోయారు.

మడుగులో అక్రమ నిర్మాణాల జోరు

మడుగులో టీడీపీ నాయకుల భవంతులు యథేచ్ఛగా వెలిశాయి. చక్రాలమడుగు(ఒకప్పుడు మంచినీటి మడుగు) ఆక్రమణల మడుగుగా మారిపోయింది. తాజాగా మడుగులోకి నూతన భవంతుల నిర్మాణాలు దూసుకొచ్చాయి. ఫలితంగా మడుగు కాలువ స్వరూపంలోకి వచ్చేసింది. మడుగు స్థలాలు కోట్లు పలుకుతున్నాయి. అటు రెవెన్యూ, ఇటు ఇరిగేషన్ శాఖలు యేళ్ల తరబడి కళ్లు మూసుకునే ఉన్నాయనే విమర్శలున్నాయి. చక్రాలమడుగులో అధికంగా టీడీపీ సానుభూతిపరులకు సంబంధించిన నిర్మాణాలున్నాయి. నేటికి ఆ నిర్మాణాలు కొనసాగుతూనే ఉన్నాయి.

పోరంబోకు స్థలాలుగా..

చక్రాలమడుగు పరిధిలో ఆర్‌ఎస్‌ఆర్ ప్రకారం పోరంబోకు స్థలాలుగా గుర్తింపబడి ఉంది. ఈ విషయాన్ని రెవెన్యూ అధికారులు ధ్రువీకరిస్తున్నారు. సర్వే నంబర్ 961లో ఏ, బీ, డీ పరిధిలో ఉన్న నిర్మాణాలు 150 నుంచి 200 లోపు ఉన్నట్లుగా రెవెన్యూ సిబ్బంది గుర్తించినట్లు సమాచారం. చాలా వరకు ఈ నిర్మాణాలు క్రమబద్ధీకరణ జరిగిపోవడం, రిజిస్ట్రేషన్ కావడం, చేతులు మారిపోవడం లాంటివి ఎప్పుడో జరిగిపోయిన సంగతి విదితమే. చక్రాల మడుగు చుట్టు పక్కల ప్రాంతాల్లో అనేక నిర్మాణాలు ఉన్నాయి. తమకు సంబంధించిన స్థలాలు రిజిస్ట్రేషను అయినవని వారు చెప్పుకుంటున్నారు. ఎన్‌టీఆర్ సర్కిల్, చక్రాలమడుగు పరిధిలో ఉన్న స్థలాల్లో నిర్మాణాలపై గతంలో రెవెన్యూ శాఖ అనేకమార్లు సర్వే నిర్వహించినా ఫలితం లేకపోయింది. రామ్‌నగర్ ఏరియా, రైల్వేకోడూరు రహదారి, పాత బస్టాండు రహదారి తదితర ప్రాంతాల్లో మడుగు సర్వే నిర్వహించారు.

టీడీపీ అధికారంలోకి వచ్చాక..

మడుగును సర్వే చేయడం వల్ల ఆక్రమణల బండారం బట్టబయలవుతోంది. టీడీపీ అధికారంలోకి వచ్చిన ప్రతిసారి దర్జాగా అక్రమ నిర్మాణాలు వెలిశాయి. మడుగు స్థలాలకు వేరే ప్రాంతాల సర్వే నంబర్లతో దొడ్డిదారిన రిజిస్ట్రేషన్లు కూడా జరిగిపోయాయి. అటు రెవెన్యూ, ఇటు రిజిస్ట్రేషన్ శాఖల సహకారం మడుగు ఆక్రమణల వ్యవహారంలో ప్రధాన భూమిక పోషించినట్లుగా ఆరోపణలు నేటికీ వినిపిస్తున్నాయి.

25 నుంచి 6 ఎకరాలకు చేరుకున్న మడుగు..

25 ఎకరాల చక్రాలమడుగు ఇప్పుడు ఆరు ఎకరాలకే పరిమితమైందన్న వాదన వినిపిస్తోంది. చక్రాల మడుగు పరిధిలో ఆర్‌ఎస్‌ఆర్ ప్రకారం పోరంబోకు స్థలాలుగా గుర్తింపబడి ఉంది. ఈ విషయాన్ని రెవెన్యూ అధికారులు ధ్రువీకరిస్తున్నారు. టీడీపీ ఐదేళ్ల పాలనలో సర్వే చేయిస్తే ఆక్రమణల గుట్టు బయటికి వస్తుందని ఆక్రమణదారులు ఒత్తిడి తీసుకురావడంతో అప్పట్లో బాబు సర్కారు సర్వేను అటకెక్కించిన సంగతి విదితమే. ఇప్పుడు మళ్లీ అదే పరిస్థితి.

మురికి మడుగుగా మారి..

మడుగును కాపాడుకుని, ఇరువైపులా రివిట్‌మెంట్ కట్టి, వచ్చిన నీరును వినియోగించకపోవడంతో, ఆ ప్రాంతం మురికినీటికి నిల్వగా మారింది. పూర్వం ఈ మడుగు మంచినీటి మడుగుగా ఉండటంతో ఆ నీరు ఆ కాలంలో రాజంపేట ప్రాంత వాసులకు ఉపయోగపడేది. రాను, రాను ఈ మడుగులోకి పట్టణంలోని మురికినీటిని తరలించడం మొదలు పెట్టారు.

కలెక్టర్ అయినా మడుగు పరిరక్షణపై దృష్టి సారించేనా?

చక్రాలమడుగు పరిరక్షణపై అన్నమయ్య జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి దృష్టి సారించాలని పట్టణ వాసులు, రైతులు కోరుతున్నారు. మడుగు ఆక్రమణలపై ఉక్కుపాదం మోపితే కోట్ల రూపాయలు విలువ చేసే మడుగు స్థలాలు కాపాడుకోవచ్చని కలెక్టర్‌ను కోరుతున్నారు. మడుగు స్థలాలు, విస్తీర్ణంపై ఉన్నత స్థాయిలో విచారణ చేయించాలని ప్రజాప్రతినిధుల నుంచి డిమాండ్ వినిపిస్తోంది.

మరో విజయవాడ కానున్న రాజంపేట



చక్రాలమడుగుతో మరో విజయవాడగా రాజంపేటకు వరదముప్పు పొంచి ఉంది. మడుగు పూర్తిగా ఆక్రమణలతో కుంచించుకుపోయింది. పై నుంచి వచ్చిన వరద నీరు ఊటుకూరు చెరువు మీదుగా భువనగిరి పల్లె , చక్రాలమడుగులో నుంచి అత్తిరాలకు వెళుతుంది. పూర్వం ఏ విధంగా అత్తిరాలలోకి వరదనీరు వెళుతుందో అదే విధంగా వెళ్లే పరిస్థితులు లేవు. వరదనీటి ప్రవాహం వెళ్లే మార్గంలో అక్రమ నిర్మాణాలు వెలిశాయి. పట్టించుకోనే వారు కరువయ్యారు.

– మర్రి రవి, మున్సిపల్ వైస్‌చైర్మన్, రాజంపేట

దురాక్రమణ వల్ల రాజంపేటకు వరద ముప్పు



చక్రాలమడుగు కబ్జాలమయమైంది. ఇది బహిరంగ రహస్యం. దురాక్రమణ వల్ల రాజంపేటకు ఎప్పటికైనా వరద ముప్పు పొంచి ఉంది. రాష్ట్ర ప్రభుత్వం, పాలకులు సీరియస్‌గా తీసుకోవాలి. వరదల బారి నుంచి పట్టణ వాసులను కాపాడుకోవాలంటే చక్రాల మడుగు యథావిధిగా ఉండేలా జిల్లా కలెక్టర్, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలి. సర్వే చేసి, ఆక్రమణలు తొలగించి రక్షణ గోడలను నిర్మించాలి.

– పోలి శివరామిరెడ్డి, సంఘసేవకుడు, రాజంపేట

క్లుప్తంగా

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి



మృతి చెందిన బాలు


పెద్దతిప్పసముద్రం : మండలంలోని సంపతికోట పంచాయతీ ముంతపోగులవారిపల్లికి చెందిన పల్లిగడ్డ బాలు (18) సోమవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. సంపతికోట చెరువు సమీపంలోని ఓ పాడుబడ్డ బావిలో.. చెట్టుకు ఉరేసుకుని శవమయ్యాడు. అయితే మృతుడి తండ్రి పల్లిగడ్డ గోపాల్ తనకు సంబంధించిన భూమిని తమ దాయాదులు ఆక్రమించుకున్నారని ఆరోపిస్తూ నెల రోజుల క్రితం ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేయడంతో ఇటీవల పలు శాఖల అధికారులు గ్రామానికి వచ్చి విచారణ చేపట్టారు. ఈ కక్షలను దృష్టిలో ఉంచుకుని తన కుమారుడు బాలును దాయాదులే ఉరేసి చంపేశారని ఆరోపిస్తూ మృతుడి తండ్రి అనుమానితుల పేర్లను పొందు పరచి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. యువకుడి మృతికి భూ తగాదాలా, ప్రేమ వ్యవహారమా, వేరే ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా అనే విషయం పోలీసుల విచారణలో వెల్లడి కావాల్సి ఉంది.

గండి క్షేత్రంలో ఉద్యోగిపై విష ప్రయోగం

చక్రాయపేట : గండి క్షేత్రంలోని అన్నదాన సత్రంలో పని చేస్తున్న రెడ్డయ్య అనే ఉద్యోగిపై విష ప్రయోగం జరిగింది. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దేవస్థానంలో జంపు రెడ్డయ్య అనే వ్యక్తి అన్నదాన సత్రం ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నాడు. ఇక్కడే వంట మనిషిగా పని చేస్తున్న కె.రెడ్డయ్య అనే వ్యక్తిని విధి నిర్వహణలో భాగంగా రెండు రోజుల క్రితం ఆయన మందలించాడు. దీంతో కక్ష పెంచుకున్న వంట మనిషి అన్నదానం సత్రం ఇన్‌చార్జి ఇంటి వద్ద నుంచి తెచ్చుకున్న వాటర్ బాటిల్‌లో ఏదో విషం కలిపాడు. ఆ విషయం తెలియని సత్రం ఇన్‌చార్జి బాటిల్‌లో ఉన్న నీటిని రెండు, మూడు గుటికలు తాగారు. అంతలోనే గొంతు పట్టేసినట్లు అనిపించడం, ఒక విధమైన వాసన రావడంతో బాటిల్‌ను కదిలించాడు. దీంతో బాటిల్‌లో నీరు రంగు మారి నురుగు రావడంతో తోటి ఉద్యోగులకు చూపించాడు. వెంటనే ఆలయ అధికారి వెంకటసుబ్బయ్యకు సమాచారం అందించి వేంపల్లి వైద్యశాలకు వెళ్లాడు.

బూచోళ్ల భయం..
అవగాహనతోనే దూరం

- లక్కిరెడ్డిపల్లె గురుకుల పాఠశాలలో ఐదో తరగతి విద్యార్థినిపై ప్రిన్సిపల్ భర్త లైంగిక దాడికి యత్నించారు. ఈ విషయం తెలిసినా ప్రిన్సిపల్ మిన్నకుండిపోయింది. దీంతో ప్రిన్సిపల్, ఆమె భర్తపై పోక్సో కేసుతో పాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు.
- మదనపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఓ వ్యాయామ ఉపాధ్యాయుడు విద్యార్థినిపై లైగింక వేధింపులకు గురి చేశాడు. బాధితురాలి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.
- మదనపల్లె పట్టణంలో ఇటీవల ఓ కాలనీలో మూడేళ్ల బాలికను అదే ప్రాంతానికి చెందిన వ్యక్తి స్పర్శించని చోట తాకుతూ అసభ్యకరంగా ప్రవర్తించాడు. గమనించిన బాలిక తండ్రి మందలించేలోపు పారిపోయాడు. వారు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు.



ఏమీ ఎరుగని పువ్వుల్లారా..
అయిదారేడుల పాపల్లారా..
మెరుపు మెరిస్తే.. వాన కురిస్తే..
అవి మీకే అని ఆనందించే కూనల్లారా!
మీదే మీదే సమస్త విశ్వం !
మీరే భారత భాగ్య విధాతలు !
అని మహా కవి శ్రీశ్రీ అన్నారు.

ఇలాంటి చిన్నారులపై తరచూ మనిషి రూపంలో ఉన్న తోడేళ్ల కళ్లు పడుతున్నాయి.

ఇవి మచ్చుకు కొన్ని మాత్రమే. ఇలాంటి సంఘటనలు నిత్యం చోటు చేసుకుంటున్నాయి.

- పిల్లలకు పొంచి ఉన్న లైంగిక దాడుల ముప్పు
- మంచి, చెడు స్పర్శల గురించి వివరిస్తేనే మేలు
- తల్లిదండ్రులు, గురువులు చొరవ తీసుకోవాలి

మదనపల్లె సిటీ : చిన్నారులు ప్రేమతో మాట్లాడితే, ఆటలాడితే దగ్గరకొస్తారు. మన వాళ్లే.. మంచి వాళ్లే అని నమ్ముతారు. మంచితనం ముసుగులో కొందరు.. పిల్లలపై లైంగిక దాడులకు పాల్పడుతున్నారు. చుట్టూ ఉన్న వారే... తెలిసినవారే ఈ అఘాయిత్యాలకు పాల్పడుతున్నారు. ప్రతి సందర్భంలో పిల్లలను కనిపెట్టుకొని ఉండటం తల్లిదండ్రులకు కూడా సాధ్యం కాదు. వారికి మంచి, చెడు స్పర్శ (గుడ్, బ్యాడ్ టచ్)లపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులపై ఎంతైనా ఉంది.


తల్లిదండ్రులు చేయాల్సినవి

బాలికలకు చిన్న వయసు నుంచే 'మంచి స్పర్శ, చెడు స్పర్శ' గురించి అవగాహన కల్పించాలి. అపరిచితులు, తెలిసినవారు ఎవరైనా ఛాతిని, పైభాగాలు, వీపు వెనుక భాగాలు ముట్టుకున్నా వారించాలని సూచించాలి. అలా ఎవరైనా చేస్తే వద్దు అనటం లేదా అక్కడి నుంచి పారిపోవాలని వారికి అర్థమయ్యే రీతిలో వివరించాలి. పిల్లలను నిత్యం గమనిస్తూ ఉండాలి. వారితో మనసు విప్పి మాట్లాడాలి.



ఇవి మంచి స్పర్శలు

- తల, వీపుపై తట్టడం, కరచాలనం చేయడం మంచి స్పర్శగా భావిస్తారు.
- లైంగిక వేధింపులకు గురైన బాలికలపై ప్రభావాలివి
- చదువులో వెనుకబడతారు.
- మానసిక, ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి.
- తరచూ ఆందోళన, భయానికి గురవుతుంటారు.
- భోజనం చేయరు. నిద్రకు దూరమవుతారు.
- సామాజికంగా నలుగురిలో కలవరు.



ఇవి చెడు స్పర్శలు

- అనుచిత విధానంలో బాలికలను తాకడం
- వ్యక్తిగత శరీర భాగాలను తాకడం
- ఛాతి, నడుము భాగం, బుగ్గలను నిమరడం తదితరాలు



అవగాహన కల్పిస్తున్నాం



పాఠశాలలు, కళాశాలల్లో బాలికలకు వారికున్న హక్కులు, వేధింపులకు గురైతే స్పందించే తీరు, ఫిర్యాదు చేయటం లాంటి వాటిపై అవగాహన కల్పిస్తున్నాం. మంచి, చెడు స్పర్శలపై చెబుతున్నాం. అపరిచితుల వద్దకు వెళ్లొద్దని సూచిస్తున్నాం. ఎవరైనా శరీర సున్నిత భాగాలు తాకితే కేకలు వేయటం లేదా అక్కడి నుంచి పరిగెత్తి వెళ్లిపోయి రక్షించుకోవాలని చెబుతున్నాం.

-జల్లా లలితమ్మ, బాలల హక్కుల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షురాలు, మదనపల్లె

తీవ్ర ప్రభావం



తెలిసీతెలియని వయసులో బాలికలు లైంగిక వేధింపులకు గురైతే వారి భావి జీవితంపై తీవ్ర ప్రభావం ఏర్పడుతుంది. మానసిక సమస్యలతోపాటు ఆరోగ్యపరంగా ఇబ్బందులు ఎదుర్కొంటారు. చదువుపై శ్రద్ధ పెట్టలేకపోతారు. ఇలాంటి వారితో తల్లిదండ్రులు మనసు విప్పి మాట్లాడి.. ధైర్యం నూరిపోయాలి. అప్పటికీ తేరుకోని పక్షంలో సైకాలజిస్టుల దగ్గరికి తీసుకెళ్లాలి.

- చాముండేశ్వరి, సైకాలజిస్టు, మదనపల్లె

బతుకు పోరులో విగత జీవిగా మారి..

మదనపల్లె వాసి గల్ఫ్‌లో మృతి



షేక్ మాలిక్‌బాషా మృతదేహం

మదనపల్లె : బతుకుపోరులో విదేశాలకు వెళ్లి అక్కడే తనువు చాలించిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని ప్యారానగర్‌లో నివాసం ఉంటున్న అబ్దుల్‌వహాబ్ కుమారుడు షేక్ మాలిక్‌బాషా(47) కారు డ్రైవర్‌గా పనిచేస్తూ జీవించేవాడు. అతనికి భార్య సబీనా, కుమార్తె కరిష్మా భాను, కుమారుడు సయ్యద్‌కబీర్ ఉన్నారు. ఇటీవల కుమార్తెకు వివాహం జరిపించారు. వివాహానికి కొంత అప్పు చేయడంతో.. తీర్చేందుకు డబ్బులు సంపాదించుకుని రావాలని, నాలుగు నెలల క్రితం గల్ఫ్‌దేశమైన రియాద్‌కు వెళ్లాడు. డ్రైవర్‌గా పని చేసే క్రమంలో తీవ్రమైన గుండెపోటుతో అస్వస్థతకు గురయ్యాడు. దీంతో అక్కడ తెలిసిన వారు ఆస్పత్రిలో చేర్పించారు. వైద్యులు చికిత్స అందిస్తున్నా.. పరిస్థితి విషమించి ఈనెల 3వ తేదీన మృతి చెందాడు. ఈ సమాచారాన్ని మదనపల్లెలోని కుటుంబ సభ్యులకు తెలిపారు. అయితే.. మృతదేహం అక్కడి నుంచి ఇక్కడికి తీసుకురావడం వ్యయప్రయాసాలతో కూడుకున్నది కావడంతో అక్కడే ఖననం చేసేందుకు కుటుంబ సభ్యులు ఇండియన్ ఎంబసీకి అంగీకార పత్రం పంపారు.

సెల్‌ఫోన్ విషయమై కుటుంబంపై దాడి

- కొడవలితో నరకడంతో దంపతులకు తీవ్ర గాయాలు

మదనపల్లె : సెల్‌ఫోన్ చోరీ విషయమై జరిగిన ఘర్షణలో కుటుంబంపై కొడవలితో దాడి చేసిన సంఘటన సోమవారం రాత్రి మదనపల్లె మండలంలో జరిగింది. బాధితులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. చీకిలబైలు పంచాయతీ, జోలపేటకు చెందిన వసంత్ సెల్‌ఫోన్ ఇటీవల చోరీకి గురైంది. దీంతో సోమవారం రాత్రి వసంత్ మద్యం తాగి, సెల్‌ఫోన్ చోరీ విషయంగా గ్రామంలోని అందరినీ నిందిస్తూ, అసభ్యకరంగా మాట్లాడుతుండగా, స్థానికుడైన నిరంజన్(34) అతడిని ఎందుకు గ్రామంలో అందరిని తిడుతున్నావ్ అంటూ ప్రశ్నించాడు. ఇది మంచి పద్ధతి కాదని వారించాడు. అయితే మద్యం మత్తులో ఉన్న వసంత్.. నిరంజన్పై దాడి చేసి కొట్టాడు. ఇది గమనించిన నిరంజన్ తల్లిదండ్రులు నారాయణ(57), విజయమ్మ(48) గొడవను అడ్డుకునేందుకు వచ్చారు. దీంతో తీవ్ర ఆవేశానికి లోనైన వసంత్ ఇంట్లోకి వెళ్లి కొడవలి తీసుకువచ్చి తన తల్లి ప్రభావతితో కలిసి నిరంజన్ కుటుంబ సభ్యులపై దాడి చేశాడు. నారాయణ తలపై, విజయమ్మ చేతిపై నరికాడు. దీంతో వారు తీవ్రంగా గాయపడ్డారు. నిరంజన్ సైతం దాడిలో తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు బాధితులను మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. చికిత్సల అనంతరం నారాయణ పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు. తాలూకా పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

ఉరి వేసుకుని మహిళ ఆత్మహత్య



లక్ష్మి మృతదేహం

రాయచోటి టౌన్ : రాయచోటిలో ఓ మహిళ ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రాయచోటి పట్టణంలోని రాజుల కాలనీకి చెందిన దస్తగిరినాథ జీవనోపాధికి దాదాపుగా పదేళ్ల క్రితం విజయనగరం వెళ్లాడు. అక్కడే లక్ష్మిని ప్రేమించి వివాహం చేసుకొని రాయచోటికి వచ్చి కాపురం పెట్టాడు. రాజులకాలనీలో టీకొట్టు నిర్వహించుకొంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో వీరికి నాలుగేళ్ల కుమారుడు, రెండేళ్ల కుమార్తె ఉన్నారు. శనివారం రాత్రి ఏమి జరిగిందో తెలియదు. రాత్రి లక్ష్మి(26) ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకొంది. కొంత సేపటికి సంఘటనను గమనించిన భర్త విషయం బయటికి చెప్పడంతో స్థానికుల సమాచారంతో పోలీసులు అక్కడికి వచ్చి పరిశీలించారు. తరువాత విషయం మృతురాలి బంధువులకు తెలియజేయడంతో వారు వచ్చి ఆత్మహత్యపై అనుమానాలు ఉన్నాయని పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆత్మహత్యకు యత్నించిన వివాహిత మృతి



మృతి చెందిన భారతి

మదనపల్లె : ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ వివాహిత ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. టూటౌన్ సీఐ కె.రామచంద్ర తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని బసినికొండ దిబ్బలకాలనీకి చెందిన శివ భార్య భారతి (34) వినాయక చవితి రోజు ఉదయం తన పుట్టినిల్లు పుంగనూరుకు వెళదామని భర్తను కోరింది. అందుకు శివ పండుగ రోజు ఇక్కడే ఉందామని, నిమజ్జనం రోజున వెళదామంటూ ఆమెకు చెప్పాడు. ఈ విషయమై ఇరువురి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. అదే సమయంలో మనస్తాపం చెందిన భారతి పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే శివకు సమాచారం అందించి, పట్టణంలోని ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్సల అనంతరం పరిస్థితి విషంగా ఉండటంతో వైద్యుల సూచనల మేరకు మెరుగైన వైద్యం కోసం తిరుపతి స్విమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు సీఐ తెలిపారు. ఏఎస్ఐ రమణ తిరుపతికి చేరుకుని మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహింపజేసి, కుటుంబ సభ్యులకు అప్పగించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఎస్‌ఐపై టీడీపీ వర్గీయుల దాడి


- నిమజ్జనంలో రెండు వర్గాల మధ్య గొడవ
- నివారించబోయిన ఎస్‌ఐపై బరితెగింపు
- అధికార పార్టీ నేతల ఒత్తిడితో కేసు నమోదుకు బ్రేక్?

రాయచోటి : వినాయక విగ్రహ నిమజ్జన ఊరేగింపులో రెండు వర్గాల మధ్య గొడవ నివారించేందుకు వెళ్లిన ఎస్‌ఐ భక్తవత్సలంపై దాడికి తెగబడ్డ సంఘటన సంబేపల్లె మండలంలో చోటు చేసుకొంది. నాగిరెడ్డి అన్నప్పగారిపల్లెలో టీడీపీ వర్గీయులు కొంత మంది ఈ సంఘటనకు బరితెగించారు. సోమవారం సాయంత్రం వినాయకుని నిమజ్జనంలో భాగంగా గొడవ మొదలైంది. వెంటనే స్థానిక ఎస్‌ఐ భక్తవత్సలం సంఘటన స్థలానికి చేరుకొని ఇరు వర్గాలను వారించి స్టేషన్‌కు వెళ్లారు. అనంతరం ఇరు వర్గాలు మద్యం మత్తులో దాడులు చేసుకుంటున్న సమాచారం అందడంతో తిరిగి ఎస్‌ఐ ఆ గ్రామానికి చేరుకున్నారు. ఇరు వర్గాలను చెదరగొట్టే ప్రయత్నం చేశారు. ఆ సమయంలో టీడీపీకి చెందిన కొంత మంది ఎస్‌ఐపై దాడి చేశారు. అప్రమత్తమైన పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. ఎస్‌ఐపై దాడి సంఘటనపై కేసు నమోదుకు ప్రయత్నిస్తున్న పోలీస్ అధికారులపై స్థానిక అధికార పార్టీ నాయకులు తమ అధికారాన్ని ఉపయోగించి కేసు నమోదు చేయనీయకుండా ఒత్తిడి తెచ్చారు. ఈ విషయమై రూరల్ సీఐ వరప్రసాద్‌ను వివరణ కోరగా మద్యం మత్తులో దాడికి పాల్పడ్డారని, వారికి గ్రామస్తుల సమక్షంలో భయం పెట్టి కేసు నమోదు చేయకుండా వదిలి పెట్టామని తెలిపారు.


సంబరంలో విషాదం

సంబరం విషాదంగా మారింది. గణేష్ నిమజ్జనంలో అపశ్రుతి చోటుచేసుకుంది. వైఎస్ఆర్, అన్నమయ్య జిల్లాల్లో వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. మూడో రోజైన సోమవారం వైభవంగా నిమజ్జన కార్యక్రమం చేపట్టారు. విగ్రహాలను ఊరేగింపుగా, ఉత్సాహ భరితంగా తీసుకెళ్లారు. ఎంతో ఆనందంతో పాలుపంచుకున్న ఐదుగురు తిరిగి ఇంటికి రాలేదు. తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయారు. తల్లిదండ్రులకు తీరని శోకం మిగిల్చారు. దీంతో బాధిత కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోదించారు.

- వినాయక నిమజ్జనంలో అపశ్రుతి
- వైఎస్ఆర్ జిల్లాలో ముగ్గురు దుర్మరణం
- అన్నమయ్య జిల్లాలో ఇద్దరు మృతి
- పలువురికి గాయాలు
- మిన్నంటిన బాధితుల ఆర్తనాదాలు



వంశి



రాజ



వీరపునాయునిపల్లె మొగమూరు వాగు వద్ద రోదిస్తున్న మృతుల కుటుంబ సభ్యులు

వీరపునాయునిపల్లె : వైఎస్ఆర్ జిల్లా వీరపునాయునిపల్లె మండలంలోని మొగమూరు వాగులో ఇద్దరు మృతి చెందారు. వివరాలిలా ఉన్నాయి. వేంపల్లె పట్టణానికి చెందిన కొంత మంది వినాయక విగ్రహాన్ని నిమజ్జనం చేసేందుకు వీరపునాయునిపల్లె మండలంలోని యస్.పాలగిరి క్రాస్ వద్ద ఉన్న మొగమూరు వాగు వద్దకు తీసుకువచ్చారు. నీటిలోకి వదులుతుండగా ప్రతిమతోపాటు ప్రమాదవశాత్తు వంశి(25), రాజ(40) వాగులో పడిపోయారు. విషయం తెలుసుకొన్న ఎస్సై మంజునాథ్ తమ సిబ్బందితో సంఘటన స్థలానికి వెళ్లి స్థానికుల సాయంతో గల్లంతయిన వారిని వెలికితీసే కార్యక్రమం చేపట్టారు. ఫలితం దక్కక పోవడంతో పులివెందుల నుంచి ఫైర్‌స్టేషన్ సిబ్బందిని పిలిపించారు. స్థానికుల సహకారంతో దాదాపు 5 గంటల పాటు శ్రమించి ఎట్టకేలకు మృతదేహాలను వెలికి తీశారు. పోస్టుమార్టం నిమిత్తం వేంపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా, వంశీకి ఇంకా పెళ్లి కాలేదు. రాజ అనే వ్యక్తికి భార్య, ముగ్గురు ఆడపిల్లలు.. ఒక మగపిల్లవాడు ఉన్నారు. మృతుల కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోదించారు.

గుండెపోటుతో..

సంబేపల్లె : అన్నమయ్య జిల్లా సంబేపల్లె మండలంలోని దుద్యాల గ్రామంలో పెద్దకోడివాండ్లపల్లెకు చెందిన ఉప్పు సుబ్బరామయ్య (54) వినాయక చవితి సందర్భంగా తన సొంత ఖర్చుతో గణేషుడి విగ్రహాన్ని గ్రామస్తులకు అందజేశాడు. ఈ క్రమంలో సోమవారం నిమజ్జనానికి తరలిస్తుండగా స్వామికి టెంకాయకొట్టి పూజలు నిర్వహిస్తుండగా ఒక్కసారిగా గుండెనొప్పి రావడంతో కుప్పకూలిపోయాడు. అక్కడికక్కడే మృతి చెందాడు.



సుబ్బరామయ్య (ఫైల్)

• ట్రాక్టర్ కిందపడి..



గౌతం (ఫైల్)

చక్రాయపేట : వైఎస్ఆర్ జిల్లా చక్రాయపేట మండలంలోని నెరుసుపల్లె వద్ద ట్రాక్టర్ కింద పడి పోలేపల్లి గౌతం (17) అనే ఇంటర్ విద్యార్థి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గౌతం అన్నమయ్య జిల్లాలోని మదనపల్లె సమీపాన ఉన్న అంగళ్లుకు చెందిన నాగరాజు కుమారుడు. అతను చక్రాయపేట మండలం ఆంజనేయపురంలోని తమ బంధువుల ఇంటిలో ఉంటూ రాయచోటిలో ఇంటర్మీడియెట్ చదువుతున్నాడు. రోజూ ఆంజనేయపురం నుంచి రాయచోటికి వచ్చి, వెళ్లేవాడు. వినాయక చవితి సందర్భంగా ఆంజనేయ పురంలో గ్రామస్తులందరూ కలిసి విగ్రహాన్ని ఏర్పాటు చేసుకున్నారు. తక్కలపల్లి సమీపాన ఉన్న కాలేటి వాగుకు తీసుకెళ్లి నిమజ్జనం చేసి కుప్పం బురుజు పల్లె, నేరుసుపల్లె మీదుగా ఆంజనేయపురానికి ట్రాక్టర్ వస్తుండేవారు. నిరసుపల్లె వద్దకు రాగానే గౌతమ్ ఎగిరి ట్రాక్టర్ ట్రాలీ కింద పడ్డాడు. దీంతో తల పగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. ఆంజనేయపురానికి చెందిన ఆదిత్య అనే మరో యువకుడు కూడా ట్రాక్టర్లో నుంచి కిందపడ్డాడు. ఇతడికి స్వల్ప గాయాలు తగిలాయి. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని వేంపల్లి ప్రభుత్వ వైద్యశాలకు పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్లు పోలీసులు తెలిపారు.

• చెరువులో ట్రాక్టర్ బోల్తా

- ఒకరు మృతి
- 8 మందికి తీవ్ర గాయాలు





మృతి చెందిన అఫ్జల్, రోదిస్తున్న మృతుడి తల్లి ఆలంబి

పెద్దమండ్యం : అన్నమయ్య జిల్లా పెద్దమండ్యం మండలంలోని పాపేపల్లె పంచాయతీ గుడిశవారిపల్లె చెరువు వద్ద వినాయక నిమజ్జనంలో అపశ్రుతి చోటు చేసుకుంది. గుడిశవారిపల్లె నుంచి పది మందితో వస్తున్న ట్రాక్టర్ ప్రమాదవశాత్తు చెరువులో పడిపోయింది. ఈ సంఘటనలో పి.తురకపల్లెకు చెందిన 11 ఏళ్ల అఫ్జల్ మృతి చెందగా, పి.తురకపల్లె, గుడిశవారిపల్లెకు చెందిన రెడ్డి సంజీవ, జాఫర్‌వలీ, ఖాజా, హర్షద్, సుబహాన్, అమీన్, అర్షద్, రెడ్డిబాషాలకు తీవ్ర గాయాలయ్యాయి. పి.తురకపల్లెకు చెందిన మౌలాసాహెబ్‌కు అఫ్జల్ ఒక్కగానొక్క కుమారుడు. ముగ్గురు ఆడపిల్లల తరువాత కుమారుడు పుట్టాడు. ఆ బాలుడు యల్లంవారిపల్లె ఉన్నత పాఠశాలలో ఆరవ తరగతి చదువుతున్నాడు. బిడ్డల పోషణ కోసం తండ్రి మౌలాసాహెబ్ ఉపాధి నిమిత్తం కువైట్‌కు వెళ్లారు.



చెరువులో బోల్తా పడిన ట్రాక్టర్